క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



రెడ్ల సంఘు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: రెడ్ల సంక్షేమ సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి మంగళవారం తన నివాసంలో ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, రెడ్ల సంఘం నాయకులు సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ఏర్పాటు



మద్దికెర చేనేత కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు

మద్దికెర: మండల కేంద్రంలోని చేనేత కాలనీలోకి వెళ్లాలంటే గతంలో ముళ్ల కంపలు, మురుగు కాలువలు దాటి వెళ్లాల్సి వచ్చేది. గత పాలకులు హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకున్నారే గానీ రోడ్డు వేయలేదు. ఈ స్థితిలో 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గ్రామంలో పర్యటించిన సమయంలో ప్రజలు రోడ్డు కావాలని అడిగారు. వెంటనే రూ. 20 లక్షలు నిధులు మంజూరు చేయించి రోడ్డు వేయించి ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చుకున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి



పైపులను పరిశీలిస్తున్న అధికారులు

మద్దికెర: మండలంలోని గ్రామాలలో ఇంటింటికీ తాగునీరందించేందుకు జలజీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్ ఆదేశించారు. ఆయన మంగళవారం మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో పనులను పరిశీలించారు. మద్దికెరలో మంజూరైన పైపులను పరిశీలించి అధికారులు సూచించిన మేరకు ఉపయోగించాలని లేకపోతే బిల్లులు మంజూరు కావన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బొజ్జనాయునిపేట, బురుజుల, మద్దికెర, కొత్తపల్లి గ్రామాలలో ఇంటింటికీ కొళాయి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. త్వరలోనే నీటిని సరఫరా చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు విష్ణు, చంద్రశేఖర్ ఉన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



కనకవీడులోని పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ జయన్న

నందవరం: మండల పరిధిలోని కే.పేట, కనకవీడు గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలు 28, 29లను ఎన్నికల సెక్టోరియల్ అధికారి జయన్న మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ. పోలింగ్ కేంద్రాల స్థితిగతులు, మౌలిక సదుపాయాలను పరిశీలించామన్నారు. బూత్‌లలో విద్యుత్, తాగునీటి సౌకర్యం, ర్యాంపులు, టాయిలెట్లు వంటి వసతులను పరీక్షించామన్నారు. మౌలిక వసతులు లేని కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

హొళగుంద: మండల కేంద్రం హొళగుంద శివారులో పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్ట్ చేసి బెయిల్‌పై విడుదల చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ మంగళవారం విలేకరులకు తెలిపారు. హొళగుంద శివారులోని సుళువాయి రోడ్డులో గల మిట్ట వద్ద కొందరు పేకాట ఆడుతుండగా దాడి చేసి పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ. 27 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు. అలాగే 9 బైక్‌లను సీజ్ చేసినట్లు ఆయన చెప్పారు.

బీమా తక్షణ సాయం అందజేత

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ బీమా నిరుపేదలకు అండగా నిలిచిందని గ్రామ నాయకులు రమేశప్పగౌడ్, ఎల్లాగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం నందవరంలో నామినీ ఒంటెద్దు మహేశ్వరమ్మకు బీమా తక్షణ సాయం కింద మంజూరైన రూ.10 వేలు నగదుతో పాటు ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఆమె భర్త సుంకప్ప ఈ నెల 8వ తేదీన అనారోగ్యంతో మృతి చెందడంతో వైఎస్సార్ బీమా మంజూరైంది. తక్షణ సాయం కింద రూ.10 వేలు అందించామని, మిగతా సొమ్ము నామినీ బ్యాంకు ఖాతాలో 15 రోజుల్లోగా జమ అవుతుందని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు.

సంక్షేమ పాలనకు చిరునామా వైఎస్ జగన్





వెల్దుర్తిలో మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, తెర్నెకల్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎమ్మిగనూరులో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

వెల్దుర్తి(కృష్ణగిరి): అవినీతికి తావులేకుండా, పారదర్శకంగా ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలను అందిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనకు చిరునామాగా మారారని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి ఆధ్వర్యంలో వెల్దుర్తి సచివాలయం-1 పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం కొనసాగింది. ముందుగా ఎంపీడీఓ శ్రీనివాసరావ్, సర్పంచ్ ముత్యాల శైలజ, ఈఓ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సంక్షేమ పథకాల బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి ఆర్‌కే రోడ్డులో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ నాలుగున్నరేళ్లలో అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. వెల్దుర్తి సచివాలయం-1 పరిధిలోనే దాదాపు 30 కోట్ల సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులు జరిగాయన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీల మోసాలు, తమ ప్రభుత్వం అమలు పరిచిన హామీలను వివరించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా భావించి సుపరిపాలన అందిస్తున్న వైఎస్ జగనన్నను తిరిగి సీఎంగా రానున్న ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. జెడ్పీటీసీ సుంకన్న, బ్రహ్మగుండం ఆలయ చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి, నాయకులు గట్టు ఆరిఫ్, దేవమ్మ, చిట్టెమ్మ, రఘురెడ్డి, శివారెడ్డి, నాగిరెడ్డి, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకుంటేనే అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతుందని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, జేసీఎస్ పట్టణ కన్వీనర్ షబ్బీర్ అహమ్మద్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని గిప్సన్ కాలనీ-2 లోని 17వ వార్డు సచివాలయం పరిధిలో వైఎస్సార్‌సీపీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును కౌన్సిలర్ వాహిద్, రామాంజిని రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. మున్సిపల్ ఏఈ మధన్, కౌన్సిలర్ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని జేసీఎస్ మండల కన్వీనర్ మనోహర్ రెడ్డి, సర్పంచ్ మౌనిక అన్నారు. మండలంలోని పెద్దమరివీడు గ్రామ సచివాలయంలో మంగళవారం సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. పంచాయతీ కార్యదర్శి రఫిక్, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసన్న ఆచారి, శంకర్ రెడ్డి, లోకేష్, నరసింహుడు, గజేంద్ర, నాగేష్, క్రిష్ణగౌడ్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిద్దామని పార్టీ మండల కన్వీనర్ మల్లికార్జున, జెడ్పీటీసీ కిట్టు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం తెర్నెకల్ గ్రామంలో సర్పంచ్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో 'ఏపీకి జగనే మళ్లీ ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజారెడ్డి, తెర్నెకల్ సర్పంచ్ అరుణ్‌కుమార్, నాయకులు రాఘవేంద్ర, లుముంబా, ఎంపీడీఓ గౌరీదేవి, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి అవార్డు



అవార్డు అందుకుంటున్న టీచర్ కల్యాణికుమారి

పత్తికొండ రూరల్: తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పత్తికొండ మండలం జిరాళ్లమలతండాలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కల్యాణి కుమారి అవార్డు అందుకున్నారు. కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, తెలంగాణ శాసన సభ మాజీ స్పీకర్ మధుసూదన్‌ఆచారి, బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుల భరణం కృష్ణ మోహన్‌రావు ఆమెను ప్రశంసిస్తూ ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు అందజేశారు. విద్యార్థులు లేక మూసివేత దిశగా ఉన్న పాఠశాలలో ఆమె చక్కని విద్య అందించడంతో పాటు పలు సేవలందించారు. గ్రామంలో విద్యార్థులెవరూ ప్రైవేటు పాఠశాలకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలలోనే చదివేలా ఆమె చేసిన కృషిని అతిథులు అభినందించారు.

15 నుంచి 'ఆడుదాం-ఆంధ్ర' పోటీలు

గోనెగండ్ల: గ్రామీణస్థాయి క్రీడాకారుల్లో నైపుణ్యం వెలికి తీసేందుకు ప్రభుత్వం డిసెంబర్ 15వ తేదీ నుంచి సచివాలయ స్థాయిలో నిర్వహిస్తున్న ఆడుదాం- ఆంధ్ర క్రీడాపోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు విజయవంతం చేయాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయని, గ్రామస్థాయిలో ఈనెల 15వ తేదీ నుంచి 20 వరకు, మండల స్థాయిలో 21వ తేదీ నుంచి జనవరి 4 వరకు జరుగుతాయన్నారు. క్రీడల నిర్వహణకు మైదానాలను గుర్తించాలన్నారు. ఈఓఆర్డీ నాగేష్, పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్, వెంకటేశ్వర్లు, సతీష్, సోమేష్, నరేంద్ర, తోటయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం – ఆంధ్ర' కిట్ల పంపిణీ

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆడుదాం -ఆంధ్ర' క్రీడా పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ దశరథరామయ్య సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 19 గ్రామ సచివాలయాలకు కిట్లను పంపిణీ చేశామన్నారు. క్రికెట్ పురుషులకు 38, మహిళలకు-19 కిట్లు, బ్యాడ్మింటన్‌కు 114 రాకెట్లు, 19 నైలాన్ నెట్లు, వాలీబాల్ క్రీడకు సంబంధించి 57 బాల్స్, 19 నైలాన్ నెట్లను పంపిణీ చేశారు. 15వ తేదీ నుంచి క్రీడా పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. అందరి సహకారంతో క్రీడాపోటీలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల పట్ల భయం వీడాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగలక్ష్మిదేవి

పత్తికొండ రూరల్: విద్యార్థులు పరీక్షల పట్ల భయం వీడాలని సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగలక్ష్మిదేవి సూచించారు. మంగళవారం పత్తికొండలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో డివిజన్ పరిధిలోని హాస్టళ్లలో ఉంటున్న పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివి అత్యధిక మార్కులు సాధించాలన్నారు. సందేహాలు తలెత్తితే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. సహాయ సాంఘిక సంక్షేమ అధికారి బాబు, ఇంపాక్ట్ సంస్థ సైకాలజిస్టు మహేంద్ర, హెచ్‌ఎం ఉస్మాన్‌బాషా పాల్గొన్నారు.

మలేరియా నివారణకు చర్యలు



సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి నూకరాజు

ఆలూరు రూరల్: మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి నూకరాజు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక మొలగవల్లి పీహెచ్‌సీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమలు వ్యాప్తి చెందకుండా ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశా సిబ్బంది ఇంటింటికీ తిరిగి జ్వరం ఉన్న వారి వివరాలు సేకరించాలన్నారు. వారికి ఎప్పటికప్పుడు మలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలని సూచించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే – డ్రైడే నిర్వహించాలని చెప్పారు. డాక్టర్ రవి, సూపర్‌వైజర్లు ఆండ్రూస్ తదితరులు ఉన్నారు.

హాలహర్వి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా ఆఫీసర్ నూకరాజు తనిఖీ చేశారు. ఆశావర్కర్లు, వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలు దోమకాటుకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రి వేళల్లో దోమతెరలు వాడాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఈ విధంగా ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. డాక్టర్లు తిమ్మన్న, మన్సూర్‌వలీ, సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

చిప్పగిరి: మండలంలోని గుమ్మనూరు గ్రామానికి చెందిన తలారి హనుమంతు కూతురు వివాహ ఖర్చుల నిమిత్తం ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ మంగళవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డును బాగు చేయండి

తుగ్గలి: మండల పరిధిలోని జీ.ఎర్రగుడిలో ప్రధాన రహదారి కంకరతేలి గుంతలు పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ మార్గంలో నిత్యం వాహనాల రద్దీ ఉండడంతో దుమ్ము ఇళ్లల్లోకి వస్తోందని రోడ్డుకు ఇరువైపులా ఉన్న కుటుంబాల ప్రజలు వాపోతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

నేడు కార్యాలయాల ప్రారంభోత్సవం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని దేవనబండ గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ భవనాలను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి బుధవారం ప్రారంభిస్తారని సర్పంచ్ పొట్లపాటి ప్రవీణ తెలిపారు. గ్రామంలో ప్రజల సౌకర్యార్థం నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్‌లతో పాటు, రూ.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీతోనే కురువలకు గుర్తింపు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ లింగప్ప

హాలహర్వి: ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న కురువల అభ్యున్నతికి పెద్దపీట వేశారని జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఏ జిల్లాలో లేనివిధంగా ఆలూరు నియోజకవర్గంలో జెడ్పీ వైస్ చైర్మన్ బొజ్జమ్మ, ఇద్దరు జెడ్పీటీసీలు, కురువ సంఘం కార్పొరేషన్ జిల్లా చైర్మన్‌గా హాలహర్వి గ్రామానికి చెందిన బజారప్పకు అవకాశం కల్పించినట్లు వివరించారు. ఇన్ని పదవులు ఏ ప్రభుత్వం ఇవ్వలేదని, వైఎస్సార్సీపీ ప్రభుత్వానికి తామంతా కట్టుబడి ఉన్నామన్నారు. రాష్ట్ర కురువ సంఘం అధ్యక్షుడు కె.లింగమల్లప్ప మాట్లాడుతూ.. కురువలకు గుర్తింపునిచ్చింది వైఎస్సార్‌సీపీ మాత్రమేనని స్పష్టం చేశారు. కురువ సంఘం నాయకులు లింగమల్లప్ప, బజారప్ప, వన్నూరప్ప, బసవప్ప, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కరువు బృందం రాక

ఆస్పరి: కరువు పరిస్థితులను తెలుసుకునేందుకు బుధవారం మండలంలోని బిల్లేకల్లు గ్రామానికి కేంద్ర కరువు బృందం సభ్యులు రానున్నట్లు ఏఓ నరేంద్రకుమార్ మంగళవారం తెలిపారు. ఇక్కడ రైతులు హాజరై ఖరీఫ్ సీజన్‌లో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను వారికి వివరించాలన్నారు. అలాగే వైఎస్సార్ సీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి కేంద్ర బృంద సభ్యులను కలిసి ఇక్కడి పరిస్థితులు, రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ పెద్దయ్య తెలిపారు.

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని చిన్నహుల్తి, జూటూరు గ్రామాల్లో బుధవారం కరువు బృందం పర్యటించనున్నట్లు ఏఓ వెంకట్రాముడు మంగళవారం తెలిపారు. 2023 ఖరీఫ్‌లో పంట నష్టం అంచనా వేసేందుకు పర్యటన కొనసాగుతుందన్నారు.

పైపులైన్ పనుల పరిశీలన

మద్దికెర: ఇంటింటికీ కొళాయి పథకానికి సంబంధించి స్థానిక సాయినగర్‌లో జరుగుతున్న పైపులైన్ పనులను జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎలాంటి రుసుం లేకుండా కొళాయి కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. పంచాయతీ సలహాదారు ఆంజనేయులు వెంట ఉన్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): అంగన్‌వాడీ వర్కర్ల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు మాధవస్వామి కోరారు. మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం విధులు బహిష్కరించి మండల కార్యాలయాల ఆవరణలో టెంట్ వేసుకుని సమ్మె చేపట్టారు. ఏఐటీయూసీ, ఆటో వర్కర్స్ యూనియన్, పలు అనుబంధ సంఘాలు సంఘీభావం తెలుపుతూ సమ్మెలో పాల్గొన్నారు.

నేడు గొర్రెల పెంపకందారుల సొసైటీ ఎన్నికలు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి బ్రహ్మగుండేశ్వర స్వామి గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నిక ఈనెల 13న నిర్వహించనున్నట్లు పుల్లగుమ్మి పశువైద్యాధికారి డాక్టర్ స్వాతి తెలిపారు. సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షుడితోపాటు ఐదుగురు మెంబర్ల ఎన్నిక ఉంటుందన్నారు. మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్ల స్వీకరణ, తరువాత సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ ఉంటుందని, వెంటనే కౌంటింగ్, డిక్లరేషన్ ఉంటుందన్నారు. సంఘం పరిధిలో వెల్దుర్తి పట్టణంతోపాటు రత్నపల్లె, యాదరాళ్ల, మదార్‌పురం గ్రామాల గొర్రెల పెంపకందారులు మొత్తం 252 మంది సభ్యులుగా ఉన్నారు. ఎన్నిక ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు డాక్టర్ స్వాతి తెలిపారు.

హిందూ సంప్రదాయాలను కాపాడుకోవాలి

మద్దికెర: హిందువులు ఐక్యంగా ఉండి ఆచార సాంప్రదాయాలను కాపాడుకోవాలని సూర్యనంద స్వామి, ఆత్మగిరినంద స్వామి సూచించారు. మంగళవారం స్థానిక సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ఆవరణలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. హిందూ సనాతన ధర్మం ప్రజల్లో చైతన్యం నింపుతుందన్నారు. ఫౌండేషన్ సభ్యులు శివరామకృష్ణయ్య, వినయ్‌పవర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి

ఆస్పరి: తమకు కేటాయించిన సచివాలయాల పరిధిలో మాత్రమే విధులు నిర్వహిస్తామని, అదనపు పనులు కేటాయించి పనిభారం మోపడం సరికాదని మండల ఎనర్జీ అసిస్టెంట్లు మంగళవారం ఎంపీడీఓ రాణెమ్మకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారులు తమతో అదనపు పనులు చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించి పనిభారం తగ్గించాలని కోరారు.

కౌలు రైతులకు రుణాలు

పత్తికొండ రూరల్: పత్తికొండ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పరిధిలోని కౌలు రైతులకు రుణాలు మంజూరు చేస్తామని సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. కౌలు రైతులు స్థానిక కార్యాలయాన్ని సంప్రదించి పొలం వివరాలతో పాటు, పూర్తి వివరాలు అందజేయాలని సూచించారు.

సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి



ఎమ్మిగనూరులో లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎర్రకోట జగన్

ఎమ్మిగనూరుటౌన్/గోనెగండ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఉదయం పట్టణంలోని 17వ వార్డు పరిధిలోని మైనారిటీ కాలనీలో, సాయంత్రం గోనెగండ్ల మండలంలోని పెద్దమరివీడు గ్రామంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ రామాంజినిరెడ్డిలతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమం పథకాల ద్వారా అందించిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నవరత్నాల సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదర్శంగా నిలిచారన్నారు. అవినీతి, వివక్షకు తావు లేకుండా అర్హులైన వారికి ఇంటి వద్దకే పథకాలు అందిస్తున్నట్లు వివరించారు. మేనిఫెస్టోలోని 99 శాతం హామీలను అమలుచేసిన ఘనత సీఎం వైఎస్ జగనన్నకే దక్కిందన్నారు. ఎవరి సిఫారసు లేకుండా సంక్షేమ పథకాలు మంజూరు చేసి వారి బ్యాంక్ ఖాతాలకే నగదు జమచేస్తుండటంతో నేడు ప్రతి కుటుంబం జగనన్న ప్రభుత్వమే మళ్లీ రావాలని కోరుకుంటోందని వివరించారు. వార్డు పరిధిలో కొన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు, మంచినీటి వసతి, విద్యుత్ సమస్యలపై స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యుకే రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు సునీల్‌కుమార్, వాహిద్, ఇషాక్, కేశవరెడ్డి, అమాన్, శివప్రసాద్, మన్సూర్, బందెనవాజ్, నరసన్న ఆచారి, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ రోడ్ల నిర్మాణం



మొలగవల్లిలో సీసీ రోడ్డు నిర్మాణం

ఆలూరు: మండలంలోని మొలగవల్లి గ్రామంలో రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించిన సమయంలో సీసీ రోడ్ల సమస్యను గ్రామస్తులు ఆయన దృష్టికి తెచ్చారు. మంత్రి ఆదేశాలతో నిధులు మంజూరు కావడంతో గ్రామంలోని బీసీ కాలనీ, 2, 3 వార్డులతో పాటు అవసరమైన చోట సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. పనులు వేగంగా జరుగుతుండడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాయకులు లక్ష్మిరెడ్డి, గోవిందు, మారెప్ప, వెంకటేష్ తదితరులు రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించారు.

ముగ్గురు వలంటీర్ల సస్పెన్షన్

చిప్పగిరి: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ముగ్గురు చిప్పగిరి గ్రామ వలంటీర్లను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ సీవీ కొండయ్య తెలిపారు. మంగళవారం స్థానిక సచివాలయంతో పాటు ఏరూరు గ్రామ సచివాలయంను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. 'ఆడుదాం-ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా క్రీడాకారుల పేర్ల నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం వహించిన వలంటీర్లను సస్పెండ్ చేయడంతో పాటు ఏరూరు గ్రామంలో 10 మంది వలంటీర్లుకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు నారాయణ స్వామి, జయరాం నాయక్, ప్రమీల తదతరులు పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్ట్

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తితోపాటు పలు చోట్ల బైక్‌లను దొంగలించిన ఇద్దరిని మంగళవారం అరెస్ట్ చేసి, మూడు బైక్‌లను రికవరీ చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు.. ఆరు నెలల క్రితం వెల్దుర్తి పట్టణంలో బైక్ చోరీ కేసు నమోదైంది. దర్యాప్తు చేపట్టిన ఎస్‌ఐ బృందం విశ్వసనీయ సమాచారం మేరకు ఎన్‌హెచ్-44 పక్కన బొమ్మిరెడ్డిపల్లె శివాలయం వద్ద మంగళవారం ఇరువురు దొంగలను అరెస్ట్ చేశారు. నిందితులు నంద్యాల జిల్లా, ప్యాపిలి మండలం మాధవరం గ్రామ దర్శినేని నాగభూషణం, తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌కు చెందిన అనిల్‌ను విచారించి వారి నుంచి మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను డోన్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

దేవనకొండ: ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా చూడాలని డాక్టర్ విజయ్‌మోహన్ ఆదేశించారు. ప్రతి నెల మొదటివారంలో జరిగే ఆశా డే మంగళవారం స్థానిక ఆస్పత్రిలో నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌మోహన్ మాట్లాడుతూ.. ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా ఆశావర్కర్లు కృషి చేయాలని, గర్భిణులకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం ప్రతిఒక్కరికీ అందేలా చూడాలన్నారు. గర్భిణులను మూడు నెలల్లోపు రిజిస్ట్రేషన్ చేయించాలని, ప్రతి నెలా ఆస్పత్రికి తీసుకొచ్చి పరీక్షలు చేయించే బాధ్యత ఆశావర్కర్లదేనని సూచించారు. డాక్టర్ కళ్యాణ్, సీహెచ్ఓ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక అమావాస్య పూజలు



జొహరాపురంలో కలశాలు, నందికోళ్లతో ఊరేగింపుగా వెళుతున్న చిన్నారులు, భక్తులు



పూజలందుకుంటున్న మద్దమాంబ

నందవరం: మండలంలో భక్తులు కార్తీక అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం కార్తీక మాసంలో చివరి రోజు అమావాస్య కావడంతో శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటాలాడియి. గురజాల గ్రామంలో పవిత్ర శైవక్షేత్రంలో తెల్లవారు జాము నుంచే భక్తులు నది స్నానాలు ఆచరించి రామలింగేశ్వర స్వామికి పూజలు చేశారు. అంతకు ముందు పురోహితులు హంపేష్ ఆధ్వర్యంలో స్వామివారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజాలు నిర్వహించి దీపాలు వెలిగించారు. అనంతరం స్వామికి మహా మంగళహారతి చేపట్టారు. ఆలయంలో భక్తులు ఓం నమఃశివాయ అనే పంచాక్షరి మంత్రం జపించారు. సాయంత్రం భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆయా గ్రామాల్లో భక్తులు భాజా భజంత్రీలు, నందికోళ్లతో స్వామి వార్లను పూర్వ వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. గురజాల రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టి తీర్థ ప్రసదాలు వితరణ గావించారు.